# నమ్ముటకు ప్రయాసపడుట

## చదువుటకు నియమించినవి #42

VIII. క్రీస్తు పునరుత్థానము, ప్రత్యక్షతలు, ఆరోహణం (కొనసాగింది).
- A. ఆదివారం: క్రీస్తు పునరుత్థాన దినం (కొనసాగింది).
  1. ఖాళీ సమాధి (కొనసాగింది).
     - బి. అపొస్తలులు, ఖాళీ సమాధి (లూకా 24:12; యోహాను 20:1–10; లూకా 24:24 చూడు).
  2. తొలి ప్రత్యక్షత: మగ్దలేనే మరియకు (మార్కు 16:9–11; యోహాను 20:11–18; లూకా 24:10 చూడు).
  3. రెండవ ప్రత్యక్షత: తక్కిన స్త్రీలకు (మత్తయి 28:9–11ఎ; 1, 5–8 వచనాలు చూడు).
  4. అబద్ధపు రిపోర్టు (మత్తయి 28:11–15).
  5. మూడవ ప్రత్యక్షత: పేతురుకు (1 కొరింథీ. 15:5; లూకా 24:34).
  6. నాల్గవ ప్రత్యక్షత: క్లెయొపాకును మరొకనికి (మార్కు 16:12, 13; లూకా 24:13–35).

## పరిచయం

దేవుని వాగ్దానాలలో ఒక దానిని – నమ్మడానికి – నిజంగా నమ్మడానికి – నీవెప్పుడైనా ప్రయాసపడ్డావా?[1] ఉదాహరణకు, నీ జీవితంలో ప్రతిదీ తప్పుగా పోతున్నప్పుడు, దేవుడు చివరికి "సమస్తము మేలుకలుగుటకై" సమకూర్చి జరిగిస్తాడని నమ్మడానికి నీకు ఎప్పుడైనా కష్టంగా ఉందా (రోమా 8:28)? దేవుని వాగ్దానాలను అంగీకరించడంలో మనకెట్టి సమస్య కలిగిందో, క్రీస్తు శిష్యులకు కూడా అప్పుడు ఆలాటిదే తటస్థించింది. క్రీస్తు మృతులలోనుండి లేచివస్తాడనే సమాచారాన్ని ఆయన తన శిష్యులకు తెలియజేశారు (మార్కు 8:31; 9:31). నమ్మేమాట ప్రక్కనుంచి వారాయన మాటలను గ్రహించలేదు (మార్కు 9:32; యోహాను 20:9 చూడు). ఈ పఠనంలో,[2] ఆయన మృతుడై నిజంగా లేచారనే వాస్తవాన్ని నమ్మడానికి ఆయన శిష్యులు తంటాలుపడుతున్నట్టు చూస్తాం.

---

సూచనలు

[1]ఈ పాఠములో మార్కు సువార్తలోని రెఫెరెన్సులు వివాదాస్పదమైనవి. ఈ పుస్తకములోని ఆఖరిలో ఉన్న "వివాదాస్పదమైన మార్కు ముగింపు" అనే పాఠమును చూడు.

## సమాధి వద్ద (లూకా 24:12; యోహాను 20:1-10)

మన గత పాఠం ముగింపులో, వారంలో తొలి దినాన కొందరు స్త్రీలు సమాధి యొద్దకు వెళ్లిన సంగతిని చూచాం (మత్తయి 28:1–8; మార్కు 16:1–8; లూకా 24:1–11). వారిలో మగ్దలేనే మరియ కూడా ఉంది (మత్తయి 28:1; మార్కు 16:1). ఒకానొక సమయంలో ఆమె తక్కిన స్త్రీలతో వేరుపడింది. తక్కినవారు రాకముందు సమాధి యొద్దకు వచ్చి, వారు అక్కడికి చేరకముందు సమాధిని విడిచినట్టుంది.[3] తాను సమాధియొద్దకు వచ్చినప్పుడు వారు అక్కడికి వచ్చి చేరుకున్నా, సహాయము కొరకు పరుగెత్తగోరి వారిని అక్కడ విడిచి వెళ్లియుండవచ్చు.[4]

ఎలాగైనా సరే, ఆమె సమాధియొద్దకు వచ్చినప్పుడు, "రాయి దొర్లింపబడియుండడం చూచింది" (యోహాను 20:1). సమాధిలోనికి తేరి చూడకుండ, జరుగకూడనిదేదో జరిగిందనే ఉద్దేశంతో, పేతురు, యోహానులను కనుగొనడానికి ఆమె పరుగెత్తి (యోహాను 20:2ఎ)[5] వచ్చి – [ఎవరో] – "ప్రభువును సమాధిలోనుండి యెత్తికొనిపోయిరి, ఆయనను ఎక్కడ ఉంచిరో యెరుగమని చెప్పెను" (యోహాను 20:2బి).

హెచ్చరికను కలిగి, పేతురు యోహానులు తోటయొద్దకు పరుగెత్తారు (యోహాను 20:3, 4ఎ: లూకా 24:12ఎ). యోహాను పేతురు కంటె యువకుడో ఏమో, అతడు "పేతురు కంటె త్వరగా పరుగెత్తి ముందుగా సమాధియొద్దకు వచ్చి" చేరుకున్నాడు (యోహాను 20:4బి; 8ఎ వ. చూడు). స్త్రీలు అక్కడనుండి వెళ్లిపోయిన పిమ్మట వీరు అక్కడికి వచ్చినట్టున్నారు (మత్తయి 28:8; లూకా 24:9లను చూడు).

యోహాను వంగి సమాధిలోనికి పారచూచాడు (యోహాను 20:5ఎ). "నారబట్టలు అందులో పడియుండడం" కనుగొన్నాడు గాని, "అతడు అందులో ప్రవేశింపలేదు" (యోహాను 20:5బి). పేతురు అతని వెనుక వచ్చాడు (యోహాను 20:6ఎ), సహజమైన దుడుకుతనంతో సమాధిలోనికి ప్రవేశించి. "నారబట్టలు పడియుండుటయు, ఆయన తల రుమాలు నారబట్టలయొద్ద ఉండక వేరుగా ఒక చోట చుట్టి పెట్టియుండుటయు చూచెను" (యోహాను 20:6బి, 7; లూకా 24:12బి చూడు).[6]

పేతురు యొక్క ధైర్యముచేత ప్రోత్సహింపబడినవాడై యోహాను "లోపలికి పోయి చూచి నమ్మెను" (యోహాను 20:8). ఖాళీ సమాధిలో చుట్టిపెట్టియున్న బట్టలు విశ్వాసాన్ని కలిగించడంలోని విశేషమేమి? ఒకవైపు, మరొక సమాధి స్థలానికి స్నేహితులే యేసు దేహాన్ని తరలించియుంటే, శవానికి చుట్టిన బట్ట ఊడదీసియుండేవారు కారు. మరోవైపు, ఒకవేళ సమాధి చోరులే ఆ దేహాన్ని దొంగిలించియున్నట్టయితే, కట్లు ఊడదీసి సమాయాన్ని వృధా చేసేవారు కారు. వారు నీటుగా బట్టమడిచి ఒక చోట ఉంచడం, రుమాలును వేరు చోట మడిచి పెట్టడం వంటి పనులు ఖచ్చితంగా చేసేవారు కారు. దీనికి తార్కికమైన ఒకే వివరణ ఏమంటే, సమాధి బట్టలను క్రీస్తు స్వయంగా తానే ఉంచి వెళ్లియుండాలి. ఆయన సజీవుడై ఉండాలి, ఉండి తీరాలి!

సమాధి బట్టల అమరిక యోహాను విశ్వాసంలోని ఒక అంశమై యుంటుందని అనేకమంది రచయితలు అభిప్రాయపడ్డారు. మూయబడిన తలుపులలో గుండ[7] ఆయన

ఎలా "ప్రవేశించారో," కట్లను సుగంధద్రవ్యాలను తొలగించుకుని వాటిగుండా ఆయన "బయటికి వచ్చియుంటే," సమాధి వస్త్రాలు అలాగున పడియుండవచ్చు.

> ముడుతలుపడి పగిలిన పట్టుపురుగు గూడువలెను, సూర్యకాంతిలో ప్రకాశమానమైన తన రెక్కలు విప్పి బయటికి వచ్చిన చిమ్మట పురుగువలెను ... లేదా, ఎక్కువ ఖచ్చితంగా చెప్పాలంటే, వేళ్లను వెలుపలికి తీసికొన్న తరువాత హస్తకవచము తన స్వరూపములోనే ఉన్నట్టును (సమాధి వస్త్రాలు) పడియున్నాయి.[8]

అయినా, యిప్పటికి యోహాను విశ్వాసం తాత్కాలికమయ్యిందిగాను అసంపూర్ణ మయ్యిందిగాను ఉంది. "నమ్ముచున్నాను, అపనమ్మిక కలుగకుండ సహాయము చేయు" మని ప్రభువును వేడుకొనిన తండ్రి విశ్వాసానికి దీన్ని సమాంతరగా పోల్చవచ్చు (మార్కు 9:24). "ఆయన మృతులలోనుండి లేచుట అగత్యమను లేఖనము [తానును, పేతురును] యింకను గ్రహింపరైరి" అని తరువాత తన రచనలలో యోహాను తెలిపాడు (యోహాను 20:9). అంతట వారు "తమవారియొద్దకు వెళ్లిపోయిరి" (యోహాను 20:10). యోహాను కొంతవరకు "నమ్మాడు" (యోహాను 20:8), పేతురైతే "జరిగిన దానిని గూర్చి ఆశ్చర్యపడుచు ఇంటికి వెళ్లెను" (లూకా 24:12బి).[9] ఏదియెలాగున్నా, తాను తిరిగి లేస్తాననిన ప్రభువు వాగ్దానపు నెరవేర్పుగా మాత్రం వారు దీన్ని గ్రహించలేదు.[10]

## తోటలో (మార్కు 16:9-11; యోహాను 20:11-18; లూకా 24:10)

మగ్దలేనే మరియ సమాధియొద్దకు తిరిగి వచ్చినప్పుడు, పేతురు యోహానులతో పాటు తక్కిన స్త్రీలును అక్కడ ఉంటారని ఆమె ఎదురు చూచినట్టుంది – కాని ప్రతి ఒక్కరు తిరిగి వెళ్లిపోయారు. "మరియ సమాధి బయట నిలిచి యేడ్చుచుండెను" (యోహాను 20:11ఎ), తన ప్రభువు దేహం అక్కడ లేకుండ పోయిందని, తాను తెచ్చిన సుగంధ ద్రవ్యాలు ఆ శరీరానికి పూయకుండగనే ఎవరో దానిని అక్కడనుండి తరలించారని ఏడుస్తుంది.

లోనికి వెళ్లి తనికీ చేయలేదనే తలంపు మరియకు వచ్చియుండవలసింది. "ఆమె ఏడ్చుచు సమాధిలో వంగి చూడగా, తెల్లని వస్త్రములు ధరించిన యిద్దరు దేవదూతలు యేసు దేహము ఉంచబడిన స్థలములో తలవైపు ఒకడును కాళ్లవైపున ఒకడును కూర్చుండుట కనబడెను" (యోహాను 20:11బి, 12).[11] "క్రీస్తు సమాధి కరుణా పీఠమువలెను, కూర్చుండిన దూతలు మందసముపై అమర్చబడిన కెరూబులవలెను ఉన్నారు"[12] "వారు – అమ్మా, యెందుకు ఏడ్చుచున్నావని ఆమెను అడుగగా?" (యోహాను 20:13ఎ) ఆమె "నా ప్రభువును ఎవరో యెత్తికొని పోయిరి; ఆయనను ఎక్కడ ఉంచిరో నాకు తెలియదని చెప్పెను" (యోహాను 20:13బి).

"ఆమె యీ మాట చెప్పి వెనుకతట్టు తిరిగి, యేసు నిలిచియుండుట చూచెను" (యోహాను 20:14ఎ). మార్కు 16:9 ప్రకారం, యిది ప్రభువు యొక్క తొలి పునరుత్థానపు ప్రత్యక్షత. అయితే ఆమె, "ఆయన యేసు అని గుర్తుపట్టలేదు" (యోహాను 20:14బి).

ఆమె వెంటనే ఆయనను ఎందుకు గుర్తుపట్టలేదో మనకు తెలియదు. పునరుత్థాన దేహంలో మార్పులేమైనా ఉన్నాయా?[13] ఆయన అలా తోటలో సజీవుడుగా నిలిచియుంటారని ఆమె ఎదురు చూడకపోవచ్చు.[14]

"యేసు – అమ్మా యెందుకు ఏడ్చుచున్నావు, ఎవనిని వెదకుచున్నావు? అని ఆమెను అడుగగా ఆమె ఆయన తోటమాలి అనుకొని,[15] – అయ్యా, నీవు ఆయనను మోసికొని పోయినయెడల ఆయనను ఎక్కడ ఉంచితివో నాతో చెప్పుము, నేను ఆయనను ఎత్తికొని పోదునని చెప్పెను" (యోహాను 20:15). ఇంకో విధంగా చెప్పాలంటే, "నేను ఆయనను మర్యాదగా సమాధి చేయగోరుతున్నా"నన్నట్టు ఆ మాటలు వినిపిస్తున్నాయి. క్రీస్తు యొక్క యితర అభిమానులను కూడా అందులో చేర్చుకోవాలని ఆమె కోరిందేమో.

"మరియా!" అని తన పేరుతో సంబోధించడంవలన ప్రభువు ఆమె తికమకను పోగొట్టారు (యోహాను 20:16ఎ). ఆయన పెదవులమీద తన పేరు ఆమె వినగానే, ఆయన ఎవరో ఆమెకు అర్థమయ్యింది. ఉత్సాహముతో ఆయన తట్టు తిరిగి, "ఆయనను హెబ్రీ భాషలో రబ్బూనీ అని పిలిచెను. ఆ మాటకు బోధకుడని అర్థము" (యోహాను 20:16బి).

తరువాత యితర స్త్రీలు చేసినట్టు, యిప్పుడు ఆమె, "ఆయన పాదములు పట్టుకొని" ఆయనకు మ్రొక్కియుండవచ్చు (మత్తయి 28:9). ఆమె ఆయనను పట్టి చూస్తుండగా, "యేసు ఆమెతో నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు[16] గనుక నన్ను[17] ముట్టవద్దు" అని తెలిపారు (యోహాను 20:17ఎ). ఏలాగైనా ఆయన తన తండ్రి యొద్దకు ఎక్కిపోయేది ఖాయం.[18]

ఆ మీదట ఆయన ఆమెకు ఈలాగున ఆదేశించారు: "నా సహోదరుల యొద్దకు[19] వెళ్లి – నా తండ్రియు మీ తండ్రియు, నా దేవుడును మీ దేవుడునైన వానియొద్దకు ఎక్కిపోవుచున్నాని వారితో చెప్పుమనెను"[20] (యోహాను 20:17బి). తాను సజీవుడైయున్న సంగతి వారికి తెలుపుమని – ఆయన ఆమెకు ఆజ్ఞాపించలేదు [ఆ సంగతి ఆమె వారికి తెలుపుతుందని ఆయనకు తెలుసు (యోహాను 20:18ఎ)]; అయితే, ఆయన తన తండ్రియొద్దకు తిరిగి వెళ్లనైయున్న సంగతి తెలుపుమని ఆయన ఆమెకు ఆదేశించారు. అపొస్తులులతో ఆయన జరిపిన చివరి చర్చలో తన తండ్రియొద్దకు వెళ్లడమనేది ప్రధాన చర్చనీయాంశంగా ఉంది (యోహాను 14:2–4, 12, 28; 16:5, 7, 10, 28). గనుక ఈమెతో ఆ సంగతి తెలపడం, ఆమె సందేశం అధికార పూర్వకమైనట్టు వారు గుర్తించుతారనే భావనను సూచింపవచ్చు.

అత్యానందభరితమై, "ఆమె వెళ్లి ఆ సంగతి వారికి తెలియజేసెను గాని, ఆయన బ్రదికి యున్నాడనియు ఆమెకు కనబడెననియు వారు విని నమ్మకపోయిరి" (మార్కు 16:10; లూకా 24:10 చూడు[21]). ఆయనతో కూడ ఉండినవారు అప్పటికి దుఃఖపడి ఏడ్చుచుండిరి. ఆమె తన మాటలలో ఉత్సాహం కనుపరచియుండవచ్చు, "ప్రభువును స్వయంగా చూచి"నట్లు గట్టిగా చెప్పియుండవచ్చు, ఆయన మాటలు తిరిగి తిరిగి వల్లించియుండవచ్చు (యోహాను 20:18). అయినా వారు నమ్ముటకు నిరాకరించిరి (మార్కు 16:11).

## మార్గములో (మత్తయి 28:9-11ఎ)

క్రీస్తువారి రెండవ ప్రత్యక్షత "మార్గములో" ఉన్న స్త్రీలకు (మత్తయి 28:11). ఆ స్త్రీలు భయముతోను మహా ఆనందముతోను సమాధియొద్దనుండి త్వరగా వెళ్లి దేవదూత సందేశాన్ని క్రీస్తు శిష్యులకు అందించనున్నారు (మత్తయి 28:8; లూకా 24:9, 10, 22, 23లను చూడు). అయినా "వారి మాటలు వీరి (శిష్యుల) దృష్టికి వెఱ్ఱి మాటలుగా కనబడెను గనుక వీరు వారి మాటలను నమ్మలేదు" (లూకా 24:11).

ఈ స్త్రీలు శిష్యులయొద్దనుండి వచ్చుచున్నప్పుడో లేక వారి యొద్దకు వెళ్లుతున్నప్పుడో,[22] ఎప్పుడో "మొత్తానికి ప్రభువు వారిని కలిసికొన్నారు" (మత్తయి 28:9ఎ). "వారు ఆయనయొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు" మ్రొక్కారు (మత్తయి 28:9బి). అప్పుడు ప్రభువు వారితో, "భయపడకుడి" అని చెప్పి దేవదూత వారికి తెలిపిన సంగతిని తిరిగి అన్నారు (మత్తయి 28:10బి).[23]

## పట్టణములో (మత్తయి 28:11-15)

దాదాపు ప్రభువు స్త్రీలకు ప్రత్యక్షమయ్యే కాలంలో, "కావలివారిలో కొందరు పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులన్నిటిని ప్రధాన యాజకులతో చెప్పిరి" (మత్తయి 28:11బి).[24] "భూకంపము, దేవదూతలు, తొలిగిపోయిన దేహాన్ని గూర్చి మాకు ఎవరే హెచ్చరించలేదని వారు ఫిర్యాదు చేసి ఉండవచ్చుననేది రచయిత యొక్క అభిప్రాయం!"

యేసు మెస్సీయాయైయున్నట్టు చెప్పుకొనిన సంగతిని యూదా మత నాయకులు యిప్పుడు తీవ్రంగా ఆలోచింపవలసి ఉంటుందని మనం తలంచవచ్చు. అయినప్పటికి, వారికున్న ఒకే ఆలోచన లేక అక్కర "రుజువులను రద్దుపరచడమే." వారికి చేతనైనంత మట్టుకు క్రీస్తు సమాధిని వారు భద్రము చేయగా (మత్తయి 27:65), యిప్పుడది ఖాళీగా ఉంది. దాన్ని బట్టి, వారికది యిబ్బంది కలిగించేదిగా ఉంది. ఎవరైనా పోయి అందులో ఏముందో చూడవచ్చు. యేసు నిర్జీవ దేహం అక్కడనుంచి వెళ్ళిన వాస్తవానికి వారు ఏమి బదులివ్వగలరు?[25]

యేసు శిష్యులు ఆయన మృత దేహాన్ని దొంగిలించారనే వదంతి వారు పుట్టించారు. "కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచన చేసి ఆ సైనికులకు చాల ద్రవ్యమిచ్చి, మేము నిద్రపోవుచుండగా అతని శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తికొనిపోయిరని మీరు చెప్పుడి" (మత్తయి 28:12, 13). అది అప్పటిలో బహు హాస్యాస్పదమైన కథయైయుండింది, అది యిప్పుడు చెప్పినా అలాగే ఉంటుంది. Robert Thomas, Stanley Gundry అనే వారు యిలా వివరించారు:

> మహాసభ (సన్‌హెడ్రిన్)చే కల్పించబడిన ఆ కథ ఎంత నమ్మశక్యముకానిదంటే ... అప్పటికి జరిగిన సంభవాభివృద్ధి వారిని దిక్కుతోచని స్థితికి తరిమింది. అంత బరువైన రాయి సమాధి ముందునుండి శిష్యులు తొలిగించడంలోకలిగే ఏ చిన్న శబ్దమైనా సైనికులలో ఒక్కనినైనా మేల్కొలిపియుండేదే. పైగా, సైనికులు నిదురించియుంటే, ఆ సమాధి దొంగలు ఆయన శిష్యులనే విషయం వారికి ఎలా తెలిసియుంటుంది?[26]

కావలివారు నిదురించడం మరణ దండనకు హేతువౌతుందని సైనికులు యూదుల ఉద్యోగులకు గుర్తు చేసివుండవచ్చు (అపొ. 12:18, 19; 16:27లను చూడు). ఏదియేమైనా, "ఇది అధిపతి చెవిని బడినయెడల మేమతని సమ్మతిపరచి మీకేమియు తొందర కలుగకుండ చేతుమని" యూదా మత నాయకులు సైనికులకు అభయమిచ్చారు (మత్తయి 28:14).

ఆ అభయము పొందిన సైనికులు, ఈ పనికి వారికిచ్చిన గొప్ప "ద్రవ్యమును తీసికొని తమకు బోధించిన ప్రకారము చేసిరి" (15ఎ వ.). "పాఠం బహు చిన్నది, సులభమైనది; బహుమానం బహు గొప్పది, కోరతగింది"[27] "అదే అబద్ధము నేడు ఉచితముగా చెప్పబడుతుందని" Richard Rogers అన్నాడు.[28]

"ఈ మాట యూదులలో వ్యాపించి నేటివరకు ప్రసిద్ధమైయున్నది" అని మత్తయి అప్పటి వాస్తవాన్ని మనకు వినిపించాడు (15బి వ.) – అంటే, "క్రీ. శ. 60 ప్రాంతం వరకు అది వినిపిస్తునే ఉంది. క్రీ. శ. 170 ప్రాంతంలో వ్రాయబడిన Dialogue with Tryphoలో – ప్రతి దేశములోనికిని ప్రత్యేకమైన వర్తమానికులను పంపి యూదులు ఈ కథను కకావికలు చేసారు అని Justin Martyr అన్నాడు."[29]

ఖాళి సమాధిని గూర్చి "వివరించేసే" తొలి ప్రయాస యిది, ఖాళీ సమాధిని గూర్చి వివరించడానికి "ఇరవై శతాబ్దాలుగా ప్రయత్నాలు జరిగాయి. అయితే అసలైన [వివరణ] ఎంత పనికిరాకుండా పోయిందో అవన్నీ అలాగే పనికి రాకుండపోయాయి. [ఖాళీ సమాధికి] నమ్మదగిన వివరణ దేవుడు యేసును మృతులలోనుండి లేపాడనేదే."[30]

## తెలియబడని చోటు (1 కొరింథీ. 15:5ఎ; లూకా 24:34)

క్రీస్తు ప్రభువు తరువాత పేతురుకు ప్రత్యక్షమైయుండవచ్చు. తాను సమాధి వద్ద చూచినవాటిని గూర్చి అతడింకను ఆశ్చర్యపోతున్నట్టున్నాడు (లూకా 24:12). పౌలు క్రీస్తువారి ప్రత్యక్షతలను పేర్కొన్నప్పుడు, "ఆయన కేఫాకు కనబడినట్టు చెప్పాడు" (1 కొరింథీ. 15:5ఎ). ఈ స్టడీలోని తరువాత భాగంలో, "– ప్రభువు నిజముగా లేచి సీమోనునకు కనబడెనని చెప్పు"కొంటున్న విషయాన్ని చదువుతాం (లూకా 24:34). అయితే ఈ ప్రత్యక్షతను గూర్చి మనకు ఏ వివరాలు లేవు. "బైబిలు చెప్పని కథలలో యిది ఒకటి: తన్ను ఎరుగనన్నవానికి ఆయన యిచ్చిన ప్రత్యేక ప్రత్యక్షత యిది!"[31] John Carter యిలా రాశాడు,

> పునరుత్థానుడైన యేసు ప్రభువు అతని కలిసికొనినప్పుడు పేతురు ఎప్పుడైనా ఎవరికైనా చెప్పియుంటే ... దానికి సంబంధించి మనకు ఏ రికార్డు లేదు. ఆ అనుభవం మాటలాడలేనంత పవిత్రమైనదై అతనికి ఉండవచ్చు, ఆ మీటింగు చుట్టు వేయబడిన తెరను మనం లాగకుండడం యుక్తమైయుంటుంది. ఏదియెలాగున్నా, తప్పును తెలిసికొనడంవలన ఏర్పడి పశ్చాత్తాపంతో నిండుకొనిన అతనిని తిరిగి అపొస్తలుల మధ్య తన స్థానాన్ని తీసికొని, వారి బసలో తక్కినవారితో కలిసికొమ్మని ప్రభువు అతని ప్రోత్సహించక ఉంటారా అని నేను ఆశ్చర్యపోతాను. కొంచెం తరువాత యేసు ప్రత్యక్షమైనప్పుడు అతడు వారితో ఉన్నట్టున్నాడు.[32]

## దారిలో (మార్కు 16:12, 13; లూకా 24:13-35)

యేసు మృతులలోనుండి లేచిన ఆ దినాన కనీసం యింకొక ప్రత్యక్షత జరిగింది.[33] [స్త్రీలు సమాధిని దర్శించి వచ్చిన ఆ దినముననే; లూకా 24:1] "ఇదిగో ఆ దినమందే వారిలో ఇద్దరు యెరూషలేమునుండి ఆమడ దూరమున ఉన్న ఎమ్మాయు గ్రామమునకు వెళ్లుచుండగా, ఆయన వారికి ప్రత్యక్షుడాయెను"[34] (లూకా 24:13; మార్కు 16:12 చూడు). వారిలో క్లెయొపా అనువాడు ఒకడు (లూకా 24:18); తక్కినవాటిని గూర్చిన వివరం యివ్వలేదు.[35] తక్కిన ప్రత్యక్షతలన్నిటి కంటెను, వీరిద్దరికి ఆయన కన్పించినది అతి వివరంగా చెప్పబడింది.[36]

యెరూషలేములో సంభవించిన దానినంతటిని గూర్చి క్లెయొపాయు అతని సహచరుడును మాటలాడుకొంటూ వెళ్లుతున్నట్టు లూకా 24 తెలుపుతుంది (14 వ.). క్రీస్తువారితో కలిసి నడువనారంభించారు (15 వ.), "అయితే వారాయనను గుర్తు పట్టలేకుండ వారికన్నులు మూయబడెను" (16 వ.). క్రీస్తును గుర్తించకుండ దేవుడు వారికి ఆ స్థితి కలిగించాడేమో; దుఃఖమే వారి కండ్లను మూసిందేమో (17బి వ.).[37]

వారు చర్చించుతున్న సంగతిని గూర్చి ప్రభువు వారినడిగారు (17ఎ వ.). గత మూడు దినములుగా జరిగిన సంగతులను క్లెయొపా రిహార్స్ వేశాడు (18-20 వచనాలు). దానితో ఖాళీ సమాధిని చూచివచ్చినవారి సంగతియు చేర్చాడు (22-24 వచనాలు). "ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించియుంటిమి.[38] ఇదిగాక, యీ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను" అని అన్నప్పుడు అతని గళము నిరాశతో నిండియుండవచ్చు (21 వ.). "మూడవ దినమున" అనే ప్రయోగం నీవు నేను ఉపయోగించినప్పుడు, "మూడవ దినమున లేచుననే" ప్రభువు వాగ్దానాన్ని మనం సూచిస్తాం (మత్తయి 17:23). క్లెయొపా భావనేమంటే, "చెప్పుకో దగినంత సమయం గతించిపోయింది, మనము నిరీక్షణ లేకయుంటిమి!" అనేదే.

అందుకాయన "అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలన్నిటిని నమ్మని మంద మతులారా, క్రీస్తు ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యముకాదా?" అని వారితో అన్నారు (లూకా 24:25, 26). దేవుని సంకల్పములో సిలువ తప్పని సరియైన భాగమైయుందని - దేవుని ఉద్దేశాలను క్రీస్తు మరణం నిరర్థకం చేయడం గాక దాన్ని స్థిరపరచుతుందని వారు గ్రహించాలి.

"మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భావము [క్రీస్తు] వారికి తెలిపెను" (27 వ.). ఆయన క్లెయొపాను అతని సహచరుని పాతనిబంధనగుండా క్రమబద్ధంగా తీసికొనిపోయారు. మెస్సీయాకొరకు ఎదురు చూచిన మూడు వందలకంటె ఎక్కువైన ప్రవచనాలను ఆయన సూచించి యుండవచ్చు. "ఆయన త్రోవలో వారితో - మాటలాడుచు లేఖనములను వారికి బోధపరచినప్పుడు, మన హృదయము మనలో మండుచుండలేదా" అని తరువాత వారు యొకనితో ఒకడు చెప్పుకున్నారు (32 వ.).

ఎమ్మాయుకు చేరేవరకు దాదాపుగా చీకటిపడింది (29 వ.). తమతో బసచేయుమని

క్లెయొపాయు అతని సహచరుడును ప్రభువును ఆహ్వానించారు (28, 29 వచనాలు). ఆయన వారితో భోజనానికి కూర్చున్నప్పుడు, ఆయన భోజనం కొరకు స్తోత్రము చేశారు (30 వ.). దాని విరిచి ఆయన వారికి పంచిపెట్టగా "వారి కన్నులు తెరువబడి ఆయనను గుర్తుపట్టిరి" (31ఎ వ.). ఆయనను గుర్తించకుండ వారిని ఆటంకపరచింది ఏదోకాని,[39] అది తొలిగించబడింది. "ఆయన రొట్టె విరుచుట వలన ఆయన వారికి తెలియబడినట్టు తరువాత వారు చెప్పుకున్నారు" (35బి వ.). ప్రభువు ప్రార్థించే ప్రత్యేకమైన విధానం వారి జ్ఞాపకాన్ని కదిలించింది.[40] వారు యిప్పుడు ఆయనను పునరుత్థానుడైన ప్రభువుగా గుర్తించారు. ఆయనను వారు అలా గుర్తించుచుండగా, "అంతట ఆయన వారికి అదృశ్యుడాయెను" (31బి వ.)!

అది బాగా చీకటిపడినా, "మార్గములో తమ అనుభవాన్ని," "ఆ పదునొకండు గురుతోను[41] తక్కినవారితోను పంచుకొనడానికి" వారు త్వరపడి యెరూషలేమునకు వచ్చారు (33, 35 వచనాలు; మార్కు 16:13ఎ). వారు అక్కడికి చేరుకొనగా, ఉత్సాహకరమైన సంభాషణ కొనసాగుతుంది. "– ప్రభువు నిజముగా లేచి సీమోనునకు కనబడెనని" వారు చెప్పుకుంటున్నారు (లూకా 24:34), కొందరైతే సందేహిస్తున్నట్టే కన్పించారు. క్లెయొపాయు అతని సహచరుడును వారి అనుభవాలను వివరించినప్పుడు, "వారు వీరిమాటలనైనను నమ్మకపోయిరి" (మార్కు 16:13).[42] ప్రభువు యొక్క శిష్యులు తమ విశ్వాసముతో పెనుగులాడుతునే ఉన్నారు (మార్కు 16:14).[43]

## ముగింపు

క్రీస్తు మృతులలోనుండి లేపబడతారని అపొస్తలులు ఎదురుచూడలేదన్న వాస్తవం తేటగా కన్పిస్తుంది. గనుక ఆయన లేపబడిన తరువాత ఆ వాస్తవంతో వారిని ఒప్పించడం కష్టంగానే ఉండింది. "అయినప్పటికి పునరుత్థానపు కథను ఈ మనుష్యులే కనిపెట్టినట్టు యూదులు వారిమీద నిందమోపారు."[44] Thomas, Gundry అనేవారు యిలా వ్యాఖ్యానించారు,

> ఖాళీ సమాధిని గూర్చిన వర్తమానం వారు పొందిన తరువాత కూడా, క్రీస్తు అనుచరులలో కన్పించే దుఃఖము, నిరాశ – వారు యేసు పునరుత్థాన కథను కల్పించారనడం ఎంత హాస్యాస్పదమైయుందో కనుపరచుతుంది. అలాటి పనిచేయడానికి వారి మానసిక స్థితి సంపూర్ణంగా వ్యతిరేకిస్తుంది.[45]

"ఆయన తిరిగి సజీవుడైయున్నాడని తన సొంత శిష్యులను ఒప్పించడమే పునరుత్థానుడైన ప్రభువు చేయవలసిన అతి గొప్ప కార్యమైయుంది."[46] మన తరువాత పాఠంలో, సామూహికంగా ప్రభువు తన అపొస్తలులకు పలుమార్లు ప్రత్యక్షుడైన విషయాన్ని – కడపటిగా వారి సందిగ్ధ ప్రయాసను పరిష్కరించిన సంగతిని చూడబోతాం.

## సూచనలు

[1]దేవుని వాగ్దానాలలో వేటి విషయమై పెనుగులాడుతున్నారో ప్రశ్నించి ఈ పాఠాన్ని ప్రారంభించడం ఒక పద్ధతి. [2]ఇది ఈ పాఠమునకు రెండవ భాగం. [3]"ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెందలకడ సమాధి యొద్దకు వచ్చి," అని యోహాను 20:1 అంటుంది. స్త్రీలు ఆదివారమున పెందలకడ (లేచి, బయలుదేరి) సూర్యోదయమైనప్పుడు" సమాధియొద్దకు వచ్చినట్టు మార్కు 16:2లో ఉంది. మరియ ఒక్కతే వచ్చిందా, స్త్రీలందరు కలిసివచ్చారా? అనే విషయంలో వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తపరచబడ్డాయి. అవి ప్రాముఖ్యం కాదు. [4]See "Narrative Preaching, 1," *Truth for Today* (February 1997): 46-47. [5]"యేసు ప్రేమించిన శిష్యుడంటే మనం యోహాను అనుకుంటాం (ఏది యెలాగున్నా, ప్రభువును ఎరుగనని చెప్పిన పేతురు అప్పటిలో యితర శిష్యులతో కలిసి ఉండడానికి ముఖం చెల్లనట్టున్నాడని, గనుక అతడు యెరూషలేములోనే వేరొక చోట ఉన్నాడనేది రచయిత యొక్క తలంపు (యోహాను 20:10; లూకా 24:12ను అతడు చూడమంటాడు). [6]దేవుడు అపొస్తలులతో వేరుగాను, స్త్రీలతో వేరుగాను వ్యవహరింపగోరినట్టు కన్పిస్తుంది. [7]"యేసు పునరుత్థాన దేహం" అనే పాఠం చూడు. [8]Peter Marshall, *Mr. Jones, Meet the Master* (New York: Fleming H. Revell Co., 1950), 110. [9]పేతురు యోహానులు ఏమి చూచారో ఆ సంగతి యితర శిష్యులకు చెప్పి యుండవచ్చు (లూకా 24:24). [10]తొలిగా అపొస్తలులు పునరుత్థానమందు విశ్వాసం ఉంచారని, తరువాత మరల లేతును అని యేసు చెప్పిన దానిని గ్రహించారని కొందరు రచయితలు అంటారు.

[11]పేతురు యోహానులు చూచిన సమాధి వస్త్రాలను ఆమె కూడా చూచి ఉండవచ్చు గాని, వారు గుర్తించిన ప్రాముఖ్యతను ఆమె గుర్తించినట్టు లేదు. [12]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 743. [13]"యేసు పునరుత్థాన దేహం" అనే పాఠం చూడు. [14]See "Narrative Preaching, 1," *Truth for Today* (February 1997): 47-48, 50. [15]అరిమత్తయియ యోసేపు ధనవంతుడైనందున, యోసేపు సమాధి ఉన్న తోటను భద్రం చేసేవంటివానితో సహా పలువురు సేవకులు అతనికి ఉండియుండవచ్చు. [16]"ముట్టవద్దని" KJVలో ఉందిగాని, గ్రీకులో, "ఇప్పుడు చేస్తున్నది చేయడం మాను"కో అన్నట్టుంది. (Robert Duncan Culver, *The Life of Christ* [Grand Rapids, Mich.: Baker Book House, 1976], 270). [17]ఆయన మరణ సమయంలో ప్రభువు అదృశ్య లోకంలోనికి (అపొ. 2:31), "పరదైసుకు" (లూకా 23:43) వెళ్లారు అప్పుడు ఆయన పరలోకానికి వెళ్లలేదు. [18]"నన్ను ముట్టవద్దు" అన్న KJV ప్రయోగం కొంత చర్చకు దోహదమయ్యింది. ఎందుకంటె తన్ను ముట్టుకొనడానికి ప్రభువు యితరులకు అనుమతినిచ్చారు (మత్తయి 28:9; లూకా 24:39; యోహాను 20:27). మరియకు ప్రభువు యిచ్చిన హెచ్చరిక – ఆయన శరీరముందో లేదో పరీక్షించవద్దని చెప్పడానికి సంబంధించింది. అ పని అపొస్తలులకు మాత్రమే యివ్వబడింది. [19]"నా సహోదరులు" అని ప్రభువు అన్నది – తన అపొస్తలులని మరియకు అర్థమయ్యింది; గనుక ఆమె వారియొద్దకు వెళ్లింది. తన శిష్యులకు "సహోదరులని" ప్రభువు వర్తింపజేసింది యిదే తొలిసారి అని McGarvey అన్నాడు (McGarvey and Pendleton, 745) హెబ్రీ. 2:11 చూడు. [20]"మన తండ్రియు," "మన దేవుడును" అని ప్రభువు అనలేదు. అపొస్తలులకంటే భిన్నమైన సంబంధం ఆయనకు తండ్రితో ఉన్నట్టు ఆయన వ్యక్తపరచారు.

[21]మరియ యొక్కయు యితర స్త్రీల యొక్కయు రిపోర్టును లూకా కలిపి మాట్లాడినట్టున్నాడు (లూకా 24:10). [22]దేవదూత చెప్పిన సమాచారాన్ని శిష్యులకు తెలియజేయబోతున్నప్పుడు ప్రభువు స్త్రీలకు కన్పించినట్టు మత్తయి 28:5–10లో కన్పిస్తుంది. స్త్రీలు దేవదూతను చూచిన సంగతి క్లెయొపాకు అందినట్టుంది (లూకా 24:22, 23) అప్పటికి స్త్రీలు ప్రభువును చూచినట్టు చెప్పబడలేదు. గనుక స్త్రీలు శిష్యుల యొద్దనుండి వెళ్లేటప్పుడే ప్రభువు వారికి కన్పించియుండాలి. [23]ఆ స్త్రీలు రెండవసారి అపొస్తలుల యొద్దకు వెళ్లియుండవచ్చు – యిప్పటికి వారు నిజంగానే ప్రభువును చూచియుంటారు. [24]బాధ్యతగల ఉన్నత పదవిలో ఉన్న సైనికులు ప్రధాన యాజకునుకి తెలియజేసి యుండవచ్చు అయితే, క్రింది హోదాకు చెందిన సైనికులు సిపాయిలకు తెలియజేసి యుండవచ్చు. [25]"సమాధి ఖాళీయైయున్న వాస్తవంపై వారు ఎలాంటి నూలూవడకు వేయగలరు?" అనే ప్రయోగం మా దేశపు వాడుకైయుంది. [26]Robert L. Thomas, ed., Stanley N. Gundry, assoc. ed., *A Harmony of the Gospels* (Chicago: Moody Press, 1978), 256. [27]McGarvey and Pendleton, 747. [28]Richard Rogers, *The Life of Christ and His Teaching* (Lubbock, Tex.: Sunset International Bible Institute External Studies Department, 1995),104. [29]McGarvey and Pendleton, 747, Martyr *Dialogue with Trypho* 108. [30]Thomas and Gundry, 256.

[31]"యజమానుని కలిసికో" డేవిడ్ రోపర్ రచనను చూడు. [32]John Franklin Carter, *A Layman's Harmony of the Gospels* (Nashville: Broadman Press, 1961), 351. [33]ఆ దినానికి సంబంధించి మరొక ప్రత్యక్షత సన్నిహితంగా కలుపబడింది. క్లెయొపాకును అతని సహచరునికిని కనబడడం, పదునొకండుగురికి కనబడడం ఒకే రోజు జరిగినై. యోహాను రోమా కాలమానాన్ని ఉపయోగించినట్టున్నాడు. యోహాను 20:19 ప్రకారం ఈ ప్రత్యక్షత కూడా ఆదివారం జరిగినట్టే ఉంది. [34]ఎమ్మాయును దేశపటంలో చూడు. [35]క్లెయొపా సహచరుడు ఎవరో మనకు తెలియదు (లూకా 24:25 చూడు). [36]వివరాలకు "యజమానుని కలిసికో" చూడు. [37]ఆయనను ఎందుకు గుర్తించలేదో అనే వివరణకు, "యజమానుని కలిసికో" అనే రచనను చూడు. [38]"ఇశ్రాయేలును విమోచింపబోవువాడు" అనేది యేసును చూచిన భావమే. యేసు మెస్సీయగా చూడబడ్డాడని క్లెయొపా అన్నాడు. అయితే ఆయన సిలువ మరణంతో ఆయన మీద పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలైనట్టు అతడన్నాడు. [39]లూకా 24:16, 17లపై ఉన్న నోట్సును చూడు. [40]ఆ సమయంలో వారు యేసును గుర్తించడానికి ఉన్న పలు అవకాశాలు "యజమానుని కలిసికో," అనే రచనలో చర్చించబడ్డాయి.

[41]"పదునొకండుగురు" అనేది అప్పటిలో అపొస్తలులను సూచించడానికి ఉద్దేశింపబడింది. ఆ సందర్భములో తోమా లేనందున పదునొకండుగురు ఆ సమయంలో వారితో కూడ లేరు (యోహాను 20:24). [42]లూకా 24:34ని మార్కు 16:13, 14తో సమన్వయం చేయడానికి నేను చూపిన మార్గం ఒకటి. [43]దీనివెంటనే ప్రభువు అపొస్తలులకు కన్పించినప్పుడు, వారు ఆయనను భూతమని తలంచారు (లూకా 24:37). [44]McGarvey and Pendleton, 742. [45]Thomas and Gundry, 256. [46]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 225.

---

# వివాదాస్పదమైన మార్కు ముగింపు

మార్కు 16 – ప్రత్యేకించి 9నుండి 20 వచనాలకు సంబంధించి ప్రశ్న ఉన్నట్టు నీకు తెలుసో తెలియదో. KJV, NKJV (Majority Text అని పిలువబడేదాన్ని ఆధారం చేసికొని) ఆ వచనాలను మూల గ్రంథంలో భాగంగా నిలుపుతాయి. అయితే, కొత్త తర్జుమాలు ఎక్కువగా (West Cott-Hort మరియు దానికి సంబంధించిన వాటిని ఆధారం చేసికొని) సమస్య ఉన్నట్టు సూచిస్తాయి. ఉదాహరణకు, ట్రూత్ ఫర్ టుడే వారు ఉపయోగించే NASB మార్కు 16:9–20ని బ్రాకెట్సులో పెడుతూ, "హాస్యమైన ముగింపును సూచిస్తుంది." నా వద్దనున్న ప్రతికలో [NASB] మధ్య కాలమ్ నోట్సులో "9నుండి 20వరకు కొన్ని ప్రాచీన ప్రతులలో లేదు" అని సూచింపబడింది. "కొన్ని తదుపరి (చేతి ప్రతులలోను) తర్జుమాలలోను" ఈ పేరాగ్రాఫ్ ఉంది.

ఈ సమస్యను గూర్చి నేను మొదట చెప్పదలచుకున్నదేమంటే, మన ఉపదేశంలోగాని, ప్రకటనలోగాని యిది ప్రధానమైన అంశంగా ఉండనవసరం లేదు. మార్కు 16:9–20లో ఉపదేశింపబడిన సిద్ధాంతానికి క్రొత్తనిబంధనలో సమాంతరమైన ఉపదేశం లేకుండా పోలేదు. మార్కు 16 యొక్క ముగింపును సవాలు చేసే ఎవరితోనైనా నీవు చదువ వలసివస్తే, అదే అంశంమీద వివాదాస్పదం కాని యితర లేఖన భాగాలను ఉపయోగించు.

పైగా, ఆచరణలో, మార్కు 16:9–20 యొక్క నిజానిజాలు ఏ బైబిలు చర్చిలోనైనా తీక్షణమైన భాగమైయుండడం సహజంగా జరుగదు. నేను ఏభై సంవత్సరాలు పైబడి ప్రసంగిస్తున్నాను. అయినా ఆ లేఖన భాగం యొక్క అధికారాన్ని కాపాడవలసిన అవసరత నాకు ఎప్పుడూ కలుగలేదు. రక్షణ విశ్వాసం ద్వారా మాత్రమే అనేవారితో గాని, నేడు

అద్భుతాలు యింకా జరుగుతాయనేవారితోగాని ఈ భాగం చర్చలోనికి వస్తుంది. ఈ రకాలైన ఏ గుంపువారును, మార్కు 16:9–20 దేవునిచే ప్రేరేపింపబడిన భాగం కాదని ఎన్నడూ అనలేదు.

కాకపోయినా, నీ పరిచర్యలో ఈలాటి ప్రశ్న తల ఎత్తవచ్చు, అందునుబట్టి ఈ విషయాన్ని గూర్చి కొన్ని సంగతులు యివ్వబడ్డాయి. ప్రాచీన చేతి ప్రతులు, తర్జుమాలు, ఆది క్రైస్తవుల రచనలు అనేవాటి కొరకు వేరే చోటికి వెళ్లవలసి వస్తుంది, కాని ప్రస్తుతానికి ఈ క్రింది నోట్సు సరిపోతుంది. ఈ చర్చను నేను – మార్కు ముగింపుకు సంబంధించి – క్లుప్తంగా నాలుగు అవకాశాలను చర్చిస్తాను.

*అవకాశం #1: మార్కు దైవప్రేరేపితమైన తన రచనను 8వ వచనంతో ముగించాడు.* ఇది అలా జరిగియుండే వీలులేనట్టు కన్పిస్తుంది. మొదటి పాఠకుల స్థానంలో నిన్ను నీవు నిలుపుకొని 16వ అధ్యాయం చదువుతూ, 8వ వచనం దగ్గర నిలిపివేయి. ఆ రికార్డు అసంపూర్ణంగా ఉన్నట్టు నీకు గోచరించదా? ఏదో కొంత చేర్చాలి అన్నట్టు నీకు తోచదా? ఈ అంశానికి సంబంధించి, Thomas Boomershine యిలా గుర్తిస్తాడు: “మార్కు సాధారణంగా ప్రవచనము నెరవేర్పు టెక్నిక్‌ను ఉపయోగించాడు గనుక 8వ వచనం దగ్గర నిలిపితే (మార్కు రచన) పాఠకులకు కలత కలిగించి వేసినట్టయి యుంటుందని అతడు అభిప్రాయపడ్డాడు.”[1]

*అవకాశం #2: ఒకటి రెండు తొలి చేతి ప్రతులలో మార్కుకు సంబంధించిన అసలైన ముగింపు పోయింది,[2] మరియు ఆ ముగింపు ఎలాటిదైయుండాలో మనకు ఏ ఐడియా కూడ లేదు.* ఈ ప్రతిపాదనలో తొలి భాగం మార్కు చర్మపు చుట్టలోనుండి గాని కోడెక్స్ (పుస్తకం)నుండి చినిగిపోయిగాని, ఏదో విధంగాపోయిగాని ఉండవచ్చు అనుకోడం కష్టం కాదు. (నా గ్రంథాలయంలోని కొన్ని పుస్తకాలు పేజీలు పోయినవై ఉన్నాయి). రెండు అతి ప్రాచీన చేతి ప్రతులలో ఈ “ముగింపు” లేక పోవడానికి యిది తార్కికమైన వివరణయైయుంటుంది. ఏదియెలాగున్నా, ముగింపు పోయి ఉంటుంది. గనుక దాన్ని తెలిసికోలేమనే తలంపు లేక ఆలోచన మనలో కొందరికి అంగీకారంగా ఉండదు. దైవప్రేరేపితమైన తన వాక్యాన్ని నాశనం కాకుండ కాపాడుకొనడానికి దేవుని చేతనవుతుందని నా నమ్మకం (1 పేతురు 1:23–25 చూడు).

*అవకాశం #3: “హ్రస్వపు ముగింపే” మార్కుకు ఆత్మ ప్రేరేపితమైన ముగింపై యుంటుంది.* ఈ ముగింపు నీయొద్దనున్న బైబిలు ప్రతిలో లేకుంటే, నావద్దనున్న NASB ప్రతిలో యిలా రాయబడియుంది:

> మరియు వారు [ఆ స్త్రీలు] ఈ ఆదేశాలను సకాలంలో పేతురుకును అతని సహచరులకును తెలియజేశారు. మరియు దాని తదనంతరం, వారి ద్వారా యేసు తానే పవిత్రమైన నాశనములేని నిత్యరక్షణను గూర్చిన ప్రకటన తూర్పునుండి పడమరవరకు పంపారు.

తరువాత వేళ్ళమీద లెక్కింపదగిన కొన్ని ప్రతులు ఈ ముగింపును కలిగి ఉన్నాయి. అయితే “హ్రస్వమైన ఈ అంతం మార్కు రాశాడనడానికి సపోర్టు ఎంత అల్పమంటే,

పండితులలో ఎవడును దానికి వకాల్తా పలుకడు."[3] C. Milo Connick యిలా ఒప్పింపబడ్డాడు: "రచనా శైలిగాని పదప్రయోగాలు గాని అసలైన మార్కు నుండి రాలేదని తర్ఫీతు పొందని పాఠకుడు సయితం చెప్పవచ్చు"[4] ఎనిమిదవ వచనంతో "కాబడిన అంతం" చేత అసంతృప్తి చెందిన ప్రతిని రాసిన లేఖకుడు అతికించినట్టు అంతమును గూర్చిన ప్రతి అంశం తెలుపుతుంది.

*అవకాశం #4: మార్కు 16:9–20 మార్కు రచన అసలైన ముగింపైయుంది.* అది నిజానికి, ఆత్మచే ప్రేరేపింపబడింది, "ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2 తిమోతి. 3:16). ఈలాటి అవకాశానికి నా యిష్టతను క్రీస్తు జీవితపు స్టడీలోని మన పాఠాల్లోనూ కనుపరచాను.

ఈ విషయంలో నీకు నీవే తీర్మానం చేసికోవలసియుంటుంది. ముందుగా సూచించినట్టే, [క్రొత్త నిబంధనలో మరెక్కడ మార్కు 16:9–20ని వ్యతిరేకించే సిద్ధాంతం కన్పించదు]. క్రొత్త నిబంధనలో కన్పించని అత్యవసరమైన సిద్ధాంతమేదీ మార్కు 16:9–20లో కన్పించదు గనుక, నేను నమ్మినట్టే నీవు నమ్మనవసరం లేదు. దీనిని పరిష్కారం కాని మర్మంగా అనేకమంది కన్సర్వేటివ్ స్కాలర్స్ (పండితులు) ఈ ప్రశ్నను వదిలివేయ నిష్టపడ్డారు.[5]

ఇక్కడ ఆలోచనకు తగిన కొన్ని సంగతులున్నాయి. "దీర్ఘమైన అంతం" (మార్కు 16:9–20) అని పిలువబడేది చాలా పాతదేయని పండితులు అంగీకరిస్తున్నారు. John F. Carter యిలా రాశాడు,

> ... మార్పులతో ఉన్నా, (అది లేని రెండు) ఎంత పాతవో దాదాపు అంతే పాతవైన అనేక యితర చేతి ప్రతులలోను, మరియు గ్రీకు మాటలాడలేని ప్రజల భాషలలోనికి చేయబడిన అతిప్రాచీన తర్జుమాలలోను ఈ లేఖన భాగం ఉంది. 130–200 ప్రాంతంలో జీవించి ముందుగా చెప్పబడిన అతిప్రాచీనమైన క్రొత్త నిబంధన ప్రతులు తయారు అవ్వడానికి 150 సంవత్సరాలకు ముందే అందులో ఒక భాగాన్ని ఐరేనియస్ అనే క్రైస్తవ రచయిత కోట్ చేసి దాన్ని మార్కుకు ఆరోపించాడు.[6]

అతి "ప్రాచీన తర్జుమాలను" గూర్చి R. C. Foster యిలా రాశాడు:

> [ఇతర భాషలలోనికి చేసిన తర్జుమాల నుండి] ఈ లేఖన భాగానికి ఏకగ్రీవమైన ఆదరణ లభించిందనే వాస్తవం అతి ముఖ్యమైనది. మనకు లభ్యమయ్యే ప్రాచీనమైన గ్రీకు చేతిప్రతులకంటే ముందే ఈ తర్జుమాలు చేయబడ్డాయి.[7]

"దీర్ఘమైన అంతమునకు వ్యతిరేకంగా అనేకమైన ఆక్షేపణలు చెప్పవచ్చుగాని"[8] అయితే ఏవియూ నిర్ధారించడానికి చాలవు. ఉదాహరణకు, మార్కు 16:9–20లో కన్పించే పదిహేడు పదాల ప్రయోగాలు, ఆ గ్రంథంలో మరెక్కడా కన్పించవు. ఈ ఆక్షేపణను గూర్చి Foster యిలా రాశాడు,

> మార్కులో ఎన్నడే ప్రశ్నింపబడని ముందున్న పన్నెండు వచనాలను Broadus తీసికొని,

తరువాత పుస్తకంలో అలాగే ఎన్నడు కన్పించని పదిహేడు పదాలను కనుగొన్నాడు. McGarvey లూకాలో పన్నెండు వచనాలను తీసికొన్నాడు, వాటిని గూర్చిన ఏ ప్రశ్నా లేదు, మరియు తొమ్మిది క్రొత్త మాటలను కనుగొన్నాడు.[9]

Carter నుండి సేకరింపబడిన కోటేషన్‌తో ఈ స్టడీని ముగించుతాను:

ఇబ్బందులన్నీ నేను గుర్తించాను ... అయితే క్రొత్త నిబంధన ఉపయోగింపబడుతున్న ఆరంభ దినాలనుండి, క్రైస్తవుల బైబిలులో దైవప్రేరేపితాన్ని ప్రసాదించుతున్న పరిశుద్ధాత్మ అనుమతించు తున్నందున, (అది అసలైన అంతమే), మార్కు తరువాత తన జీవిత కాలంలో తన అసలైన రచనకు దాన్ని కలిపాడో, లేక అపొస్తలుల కాలంలో ఎవరైనా దానికి కలిపారో గాని, అది దైవప్రేరేపితమని అధికారపూర్వకంగా గౌరవింప బడాలని నాకు తోస్తుంది. ఆయన తక్కిన దాన్ని ఎలా ప్రేరేపించాడో, తప్పక చేర్చబడిన [అది అలాటిదైతే] రాతలను కూడా ఆత్మ ప్రేరేపించగలవాడైయున్నాడు.[10]

సూచనలు

[1]Thomas E. Boomershine, "Mark 16:8 and the Apostolic Commission," *Journal of Biblical Literature* 100 (June 1981): 225-39. Quoted in Jack P. Lewis, "The Ending of Mark," *Harding University Lectures* (1988), 600. [2]మూల ప్రతులను మనకొరకు భద్రపరచియుంచటంలో పరిశుద్ధాత్ముడు ఉద్దేశించనట్టు కనిపిస్తుంది. [3]Lewis, 598. [4]C. Milo Connick, *Jesus: The Man, the Mission, and the Message,* 2d ed. (Englewood Cliffs, N.J.: Prentice-Hall, 1974), 405. [5]Jack P. Lewis గారు Harding University Lectureship (Lewis, 597-603) లో తాను ప్రసంగించిన ఉపన్యాసంలో ఈ ముగింపునకు వచ్చారు. [6]John Franklin Carter, *A Layman's Harmony of the Gospel*s (Nashville: Broadman Press, 1961), 347. [7]R. C. Foster, *Studies in the Life of Christ* (Grand Rapids, Mich.: Baker Book House, 1971), 1358. [8]రెండు ప్రాచీన ప్రతులలో ఈ ముగింపు లేదు అనేది వాస్తవమైనప్పటికి. అది తొలి దినాలలోని క్రైస్తవులకు మరుగై ఉండును. [9]Foster, 1358. [10]Carter, 347. పాత నిబంధన ఉదాహరణ, (ద్వితీయో. 34:5, 6) మోషే మరణమును గూర్చిన వివరణ పరిశుద్ధాత్మ ప్రేరణవలన జరిగింది.